కార్పొరేటర్‌కు వినతి

వనస్థలిపురం: శ్రీ గాయత్రినగర్ కాలనీలో పార్కు, సంక్షేమ సంఘం భవనం నిర్మాణానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కార్పొరేటర్‌ను కలిసి పార్కు, సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చొరవ తీసుకోవాలని వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేనావత్ సూర్య నాయక్, చైతన్య రెడ్డి, గంగాధర్, బసవయ్య, శ్రీకాంత్ నాయక్, నాగేందర్, ప్రసాద్, సిద్దయ్యన్ పాల్గొన్నారు.

దేవాలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న భక్తులు

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి శ్రీకృష్ణదేవరాయనగర్‌లోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో నాలుగు రోజులపాటు నిర్వహించనున్న ఆలయ త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహస్వామికి 108 కలశాలతో అభిషేకం, సంప్రోక్షణ సామూహిక కుంకుమార్చన, విష్వక్సేనారాధన, స్వస్తి పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, మృత్యం గ్రహణం, అంకురార్పణం, యాగశాల ప్రవేశం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న నాయకులు

వనస్థలిపురం: వనస్థలిపురం హుడా కాలనీ ఏ టైప్ క్వార్టర్స్‌లో పోచమ్మ అమ్మవారి దేవాలయం వద్ద కిరణ్‌జిత్ తల్లి భజన్ కౌర్ తూర్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్, ఫ్రిడ్జ్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌రాజ్, రాంబాబుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సాగర్‌గౌడ్, చంద్రకాంత్‌గౌడ్, కాశీనాథ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వనస్థలిపురం: ప్రగ్య, లాలిత్యం హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వేంకటేశ్వరకాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ డా.వంశీమోహన్ మాట్లాడుతూ.. పేదలు, మురికివాడల్లో నివసించే వారికి ఉచితంగా వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పి.కృష్ణ, డా.క్రాంతి, జీఎం బాలరాజ్, క్యాంప్ కోఆర్డినేటర్ మహేష్‌గౌడ్, ఆంజనేయులు, మహేష్, రామాచారి పాల్గొన్నారు.

కొత్తపేటలో 'గావ్‌చలో బస్తీచలో'



జెండా ఎగరవేస్తున్న బీజేపీ నాయకులు

నాగోలు: బీజేపీ సీనియర్ నాయకులు బొల్గం యష్పాల్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపేట డివిజన్‌లో నిర్వహించిన 'గావ్‌చలో బస్తీచలో' కార్యక్రమం నిర్వహించి భరత్‌నగర్ ఫేస్–2లో శ్రీ ముత్యాలమ్మ దేవాలయం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర సరమయోధుడు యపట్ల బాలస్వామిని సన్మానించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గీతారెడ్డి, కొర్లపల్లి స్వామి, జంగయ్య, భాస్కర్, రాజేందర్, చెన్నయ్య, శ్రీనివాస్ నరసయ్య, శ్రీనివాస్ గౌడ్, రమేష్ , వినోద్, వెంకట్, రాజు పాల్గొన్నారు.

నేడు ఆస్తిపన్నుపై స్పెషల్ డ్రైవ్

చాదర్‌ఘాట్: మలక్‌పేట సర్కిల్–6 జీహెచ్ఎంసీ పరిధిలో గ్రేటర్ కమిషనర్ ఆదేశాల మేరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు ఆస్తి పన్నుపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు డీసీ జయంత్ తెలిపారు. ఆస్తి పన్ను తగ్గింపు, ఎక్కువ పన్ను రావడం, తదితర వాటిని పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

మురుగు పరుగు.. ఇక కనుమరుగు!



శుభోదయ కాలనీలో మురుగు పరుగు(ఫైల్)

సాక్షి కథనాలతో కదిలిన యంత్రాంగం

- శుభోదయ కాలనీలో రూ. 1.50 కోట్లతో వరద కాలువలు
- భూగర్భ డ్రైనేజీ విస్తరణ పనులు ..
- రూ.1.78 కోట్లతో సీసీ రోడ్లు

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ప్రాంతంలోని శుభోదయ కాలనీలో మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన భూగర్భ డ్రైనేజీ, రహదారులు అధ్వానంగా మారడంతో స్థానికులకు ఇక్కట్లకు గురవుతున్నారు.గుంతమయమైన రహదారులు నిత్యం మురుగు పరుగుతో సహజీవనం చేస్తూ నరకాన్ని అనుభవించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆయా సమస్యలపై సాక్షిలో పలుమార్లు ప్రత్యేక కథనాలు ప్రచురించటంతో అధికారులు, ప్రజాప్రతిధులతో స్పందించిచారు. రూ.3.28 కోట్ల జీహెచ్ఎంసీ నిధులతో శుభోదయ కాలనీలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం నుంచి భగత్‌సింగ్ యువజన సంఘ భవనం, శ్రీసరస్వతీ ఉన్నత పాఠశాల నుంచి వైఎస్‌ఆర్ విగ్రహ చౌరస్తా వరకు అదే విధంగా చంపాపేట వార్డ్ ఆఫీస్ నుంచి డీమార్ట్ వరకు వరద నీటి కాలువలు, శుభోదయ కాలనీలో అవసరమైన అంతర్గత రహదారులలో భూగర్భ డ్రైనేజీ విస్తరణ, గుంతలుగా మారిన కాలనీ రహదారులను సీసీ రోడ్లుగా మార్చేందుకు సిద్ధమయ్యారు.

శాశ్వత పరిష్కారం..

కాలనీలో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన భూగర్భ డ్రైనేజీ పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చేవిధంగా లేక పోవటంతో నిత్యం రహదారుల వెంట మురుగు పరుగే..అసలే..లోతట్టు ప్రాంతంలో శుభోదయ కాలనీ ఉండటంతో చినుకు పడ్డా కాలనీ రహదారులపై వరద ప్రవహించేది. దీంతో స్థానికులు మురుగు పరుగు, దుర్వాసన, దోమలు, ఈగల స్వైర విహారంతో నానా ఇబ్బందులకు గురయ్యేవారు. ఎన్నో ఏళ్లుగా తమను పట్టి పీడిస్తున్న మురుగు, పరుగు, గుంతల రహదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుండటంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆనందంగా ఉంది..



కాలనీలో నిత్యం మురుగు పరుగు, గుంతలుగా మారిన కాలనీ అంతర్గత రహదారులతో ఇంతకాలం నరకం అనుభవించాం. ప్రతీ గల్లీ సీసీ రోడ్లుగా ఏర్పాటు చేయటం, వరదనీటి కాలువ, అవసరమైన చోట భూగర్భ డ్రైనేజీ విస్తరణ చేయటం సంతోషంగా ఉంది. కాలనీ సమస్యలపై స్పందించి తరచూ ప్రత్యేక కథనాలు ప్రచురించిన సాక్షికి ప్రత్యేక కృతజ్ఞతలు

–సునీల్, శుభోదయ కాలనీ

భూగర్భ డ్రైనేజీ విస్తరించాలి..



కాలనీలో వరదనీటి కాలువ, సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు సంతోషమే కానీ.. కొన్ని గల్లీలో మాత్రమే భూగర్భ డ్రైనేజీ విస్తరణ పనులు చేపడుతున్నారు. కాలనీలోని ప్రతీ గల్లీలో మురుగు పరుగే. సీసీ రోడ్లు ఏర్పాటు చేయకముందే భూగర్భ డ్రైనేజీ విస్తరణ చేట్టాలి. అప్పుడే సమస్యకు శాశ్వత పరిష్కారం.

–చేగోని మల్లేష్‌గౌడ్, కర్మన్‌ఘాట్



ప్రారంభమైన భూగర్భ డ్రైనేజీ విస్తరణ పనులు



వరదనీటి కాలువ పనుల కోసం తీసుకొచ్చిన పైపులు

అక్రమ పార్కింగ్‌లకు పాల్పడితే చర్యలు తప్పవు



భూపతి గట్టుమల్లు

హస్తినాపురం: అక్రమ పార్కింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భూపతి గట్టుమల్లు హెచ్చరించారు. విజయవాడ జాతీయరహదారిపై రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నం నేపథ్యంలో హయత్‌నగర్ నుంచి చింతలకుంట వరకు కొంతమేర ట్రాఫిక్‌కు అంతరాయం జరుగుతున్నా ఎప్పటికప్పుడు తమ సిబ్బందితో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూస్తున్నారన్నారు. విజయవాడ, నాగార్జున సాగర్ జాతీయ రహదారులపై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారని రహదారులపై అక్రమ పార్కింగ్‌లకు పాల్పడితే జరిమానాలు విధిస్తామన్నారు. చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తున్నామని, హస్తినాపురం జిల్లాపరిషత్ రోడ్డులో తెలంగాణ చౌరస్తా నుంచి టీకేఆర్ కమాన్ రోడ్డు వరకు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు జీహెచ్ఎంసీ అధికారులకు లేఖ రాశామని వారి సహకారంతో రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జీసస్ బోధనలు మానవాళికి అనుసరణీయం



సందేశమిస్తున్న పాస్టర్ రెవరెండ్ ఆర్.భీముడునాయక్

సైదాబాద్: కరుణామయుడైన జీసస్ బోధనలు మానవాళికి అనుసరణీయమని ఫెయిత్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ఆర్.భీముడునాయక్ పేర్కొన్నారు. ఆదివారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలోని ఫెయిత్ బాప్టిస్ట్ చర్చిలో నిర్వహించిన ఈస్టర్ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. గుడ్‌ఫ్రై డే రోజు శిలువపై మరణం పొందిన యేసుక్రీస్తు పునరుత్థానం చెందిన పర్వదినమే ఈస్టర్ అని వివరించారు. యేసుక్రీస్తు చూపిన దయ, క్షమ, ప్రేమ గుణాలను చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోషియేట్ పాస్టర్ రెవరెండ్ ఆర్.మంజులా నాయక్ పాల్గొన్నారు.



హాజరైన క్రైస్తవులు

మలక్‌పేట నియోజకవర్గ పరిధిలో..

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గ పరిధిలోని చర్చిల్లో ఆదివారం ఈస్టర్ ఆరాధనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చిలో జరిగిన ఈస్టర్ ఆరాధనలో పాస్టర్ రెవరెండ్ బోడ సాల్మన్, జూనియర్ పాస్టర్ శాంత్‌కుమార్, అధ్యక్షుడు లూకానందరావు, సభ్యులు పాల్గొన్నారు. మూసారంబాగ్ డివిజన్ కేటీనగర్ బేతనీయ చర్చిలో పాస్టర్ రెవరెండ్ సామ్యేల్ బైరపోగు ఈస్టర్ విశిష్టతను వివరించారు చర్చిల్లో క్రైస్తవులు సామూహికంగా యేసుక్రీస్తు స్తుతిగీతాలతో ఆరాధించారు. అనంతరం సర్వ మానవాళి సుఖసంతోషాల కోసం ప్రార్థనలు చేశారు.

ఈత.. తస్మాత్ జాగ్రత్త!



- ప్రమాదాలకు నిలయంగా స్విమ్మింగ్ పూల్స్
- కనీస ప్రమాణాలు పాటించని నిర్వాహకులు
- ట్రైనర్లు లేకుండా ఈత కొట్టొద్దు

దిల్‌సుఖ్‌నగర్: రోజు రోజుకు పెరుగుతున్న ఎండలతో బయటకు వెళ్లాలంటేనే జనం జంకుతున్నారు. వేసవి తాపానికి సేద తీరేందుకు పిల్లలు, పెద్దలు స్విమ్మింగ్‌పూల్స్‌ల వైపు పరుగులు తీస్తున్నారు. అయితే కొన్ని చోట్ల నిబంధలు, జాగ్రత్తలు పాటించకపోవడంతో మృత్యువాత పడుతున్నారు. మలక్‌పేట్ జోన్ పరిధిలో అనుమతిలేని స్విమ్మింగ్ పూల్స్‌లలో ట్రైనర్ లేకుండా నిర్వహిస్తుండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు.
ఆయా స్విమ్మింగ్‌పూల్స్ వద్ద కనీస సదుపాయాలు, ట్రైనర్లు లేకపోవడంతో ఈత నేర్చుకునేందుకు వచ్చే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. స్విమ్మింగ్ పూల్స్ నిర్వాహకులు ఎలాంటి అనుమతులు, ప్రమాణాలు పాటించకపోవడంతో అభం శుభం తెలియని చిన్నారుల, యువకులకు ప్రాణ సంకటంగా మారుతున్నాయి. దిల్‌సుఖ్‌నగర్, సైదాబాద్, ఐఎస్‌సదన్, సరూర్‌నగర్ తదితర ప్రాంతాల్లో అనుమతిలేని స్విమ్మింగ్‌పూల్స్ విచ్చలవిడిగా వెలిశాయి. స్విమ్మింగ్‌పూల్స్‌పై పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుకుంటూ కనీస ప్రమాణాలు పాటించడం లేదు. వీటిపై స్థానికులు చాలాసార్లు ఫిర్యాదులు చేసినా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు నిర్వాహకులపై చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇవి పాటించాలి..

- ప్రతి స్విమ్మింగ్ పూల్ వద్ద ట్రైనర్ ఉండాలి. ఆయన సమక్షంలోనే ఈత నేర్చుకోవాలి.
- చెవులలోకి నీరు వెళ్లకుండా ఎయిర్ ప్లగ్ పెట్టుకోవాలి.
- స్విమ్మింగ్ సమయంలో కళ్ల జోడు పెట్టుకోవడం మంచిది.
- ఈత కొలనులో క్లోరిన్ వంటి పదార్థాలు కలపడాన్ని దృష్టిలో ఉంచుకొని అలర్జీ కాకుండా జాగ్రత్తలు పాటించాలి.

ముగిసిన చైత్ర చంద్రిక వర్క్‌షాప్



ఔత్సాహిక కళాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నాట్య గురువు

సుల్తాన్‌బజార్: శాస్త్రీయ సంగీత నృత్యాలు, లలిత కళలు, భారతీయ సాంస్కృతిలో భాగమని రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉప సంచాలకులు జి.వసుంధర అన్నారు. శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషా నిలయంలో నవ్య నాటక సమితి నిర్వహించిన మూడు రోజుల చైత్ర చంద్రిక అభినయ వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జి.వసుంధర హాజరై ఔత్సాహిక కళాకారులకు వర్క్‌షాప్‌లో శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. యువ కళాకారులందరూ మన సాంస్కృతిక రాయబారులన్నారు. అనేక మంది కళాకారులు ఉత్సాహ భరితంగా ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వాహక సంస్థ పక్షాన నాట్య గురువు స్వప్న సుందరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇందిరా హేమ, లక్ష్మీమానస, మాధవి మాల, విజయ్‌కుమార్, బాలాజీ, కృష్ణ కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

హోరేబు చర్చిలో విరామ బైబిల్ పాఠశాల

మలక్‌పేట: అక్బర్‌బాగ్ ఆంధ్రాకాలనీలోని హోరేబు ఆరాధన మందిరంలో ఈ నెల 22 నుంచి వచ్చేనెల 3 వరకు విరామ బైబిల్ పాఠశాల(వీబీఎస్) నిర్వహిస్తున్నట్లు పాస్టర్ బ్రదర్ గద్దం మోజెస్, చర్చి పెద్దలు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 7.30 నుంచి 10.30 వరకు దేవుని వాక్యం(బైబిల్)కథల రూపంలో, చేతి పనులు, పాటల ద్వారా ఆధ్యాత్మికముగా బోధిస్తారని తెలిపారు. 5 సంవత్సరాలు పైబడిన బాల బాలికలకు 11 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు.

మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

చాదర్‌ఘాట్: నిషేధిత మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. చాదర్‌ఘాట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్‌మలక్‌పేటకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి యావర్ హుస్సేన్ (24) మాదక ద్రవ్యాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరక సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం అతడిని అదుపులోకి తీసుకున్నారు. 50 బాటిళ్ల మెఫెన్ టెర్మిన్ ఇంజక్షన్లు స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించారు. 20డీఎస్ఎన్200–పట్టుబడ్డ యావర్ హుస్సేన్

పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వీరభద్రుడు తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఎంఎస్‌ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మలిశెట్టి సీతారామ్ స్మారక వార్షిక సాహితీ పురస్కార మహోత్సవ సభ ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ దర్శకుడు జజ్జూరి వేణుకి మలిశెట్టి సీతారామ్ సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం విశ్రాంత ఐఏఎస్ అధికారి చిన వీరభద్రుడు మాట్లాడుతూ..ప్రపంచ సాహిత్యం నేడు మనకు అందుబాటులో ఉందని తెలిపారు. ప్రజలు సినిమాల నుంచి ఏమీ కోరుకోవడం లేదు కానీ తొక్కిసలాడుతూ..సినిమాలకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ఒక అంశంపై రాసేటపుడు నిజం మాత్రమే రాయాలని రచయితపై ఎలాంటి ప్రభావం ఉండకూడదని సూచించారు. అనంతరం కథాప్రపంచం, లోపల ఏదో కదులుతుననట్లు సాక్షాత్కారం నవల పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత రమేష్ కార్తీక్ నాయక్, సాహితీ వేత్త తాడి ప్రకాష్, కవులు యాకూబ్, కేపీ అశోక్‌కుమార్, ఎంఎస్‌ఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిర్వాహకులు మలిశెటి శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

28 నుంచి శంకర జయంతి మహోత్సవాలు



నల్లకుంట శంకరమఠంలోని శంకరమఠం

నల్లకుంట: నల్లకుంట శంకరమఠంలో ఈ నెల 28 నుంచి మే 2వ తేదీ వరకు ఐదు రోజుల పాటు శ్రీ శంకర జయంతి మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. శంకర జయంతి ఉత్సవాల వివరాలను శంకరమఠం నల్లకుంట శాఖ ధర్మాధికారి చింతలపాటి శ్రీనివాస మూర్తి నేడు ఒక ప్రకటనలో వివరించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో ప్రతి రోజు శక్తి గణపతి, చంద్రమౌళీశ్వర స్వామి, శంకర భగవత్పాదులు, శారదాంబలకు ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మఠం ప్రాంగణంలో ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు మహామహోపాధ్యాయ, అద్వైత సిద్ధి రత్నాకర ఆచార్య శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిచే 'శ్రీ శంకర విజయం'పై ప్రవచనాలు ఉంటాయని వివరించారు.

అక్షయ తృతీయను పురస్కరించుకొని మహాభిషేకం..

◆ అక్షయ తృతీయను పురస్కరించుకొని నెల 30న ఉదయం 7గంటలకు 'శ్రీ శారదాంబకు మహాభిషేకం'ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం మహా మంగళ హారతి, భక్తులకు ప్రసాద వితరణ ఉంటుందని చెప్పారు. అలాగే శ్రీ శంకర జయంతిని పురస్కరించుకొని మే 2వ తేదీన ఉదయం 9 గంటలకు శ్రీ శంకర భగవత్పాదులకు 'మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం', మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందన్నారు. సాయంత్రం 7గంటలకు శంకర భగవత్పాదచార్యుల ఊరేగింపు ఉంటుందని వివరించారు. శంకర జయంతి మహోత్సవాల్లో మహాభిషేకం, శతరుద్రాభిషేకం నిర్వహించాలనుకునే భక్తులు మఠంలో సంప్రదించాలని కోరారు.

ఆర్సీఐ రహదారి విస్తరణ ఎప్పుడో?



- ఆరు నెలలు గడిచినా ప్రారంభం కాని పనులు
- నిధులు మంజూరైనా ముందుకు సాగని వైనం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ నుంచి ఆర్సీఐ వెళ్లే రహదారి విస్తరణకు శంకుస్థాపన నిర్వహించి ఆరు నెలలు గడిచినా నేటికీ పనులు ప్రారంభించకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోజు రోజుకు పెరుగుతున్న వాహనాల సంఖ్యతో ఈ రహదారిపై ట్రాఫిక్ నెమ్మదించడంతో పాటు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. పహాడీషరీఫ్ బైపాస్‌లోని ఎయిర్‌పోర్ట్ హోటల్ నుంచి ఆర్‌ఐసీ కూడలి వరకు 150 ఫీట్ల మేర రోడ్డు విస్తరణ కోసం రూ.34 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు గతేడాది నవంబర్ 30వ తేదీనా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. త్వరితగతిన పనులు పూర్తయితే సాఫీగా రాకపోకలు సాగించాలనుకున్న వాహనదారులకు మాత్రం ఎదురు చూపులు తప్పడం లేదు.

ఎర్రకుంట రహదారికి..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా శ్రీశైలం హైవేలో హైదరాబాద్ మహా నగరానికి చేరుకునే పల్లె వాసులకు ఆర్సీఐ దారి చక్కటి ప్రత్యామ్నాయంగా మారింది. సొంతూర్ల నుంచి నగర శివారుకు రావడం ఒక ఎత్తయితే..అక్కడి నుంచి నగరంలోని తమ నివాసాలకు చేరుకోవడం మరో ఎత్తు. ఈ నేపథ్యంలో 2016లో అందుబాటులోకి వచ్చిన ఈ రహదారి ఎంతో ఊరటగా మారింది. శ్రీశైలం హైవే రూట్‌లోని అచ్చంపేట, కల్వకుర్తి, ఆమనగల్లు, కడ్తాల్, కందుకూర్ పట్టణాల సమీపంలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలలో ఎక్కువ శాతం కర్మన్‌ఘాట్, చంపాపేట్, మీర్‌పేట, బడంగ్‌పేట, అల్మాస్‌గూడ ప్రాంతాలలో నివాసం ఉంటున్నారు. వీరంతా 2016కు ముందు ఆయా ప్రాంతాలకు వెళ్లాలంటే (ఆర్‌సీఐ రహదారి మోకాళ్ల లోతు గోతుల సమస్య కారణంగా) పహాడీషరీఫ్, జల్‌పల్లి కమాన్, షాహిన్‌నగర్, ఎర్రకుంట, చాంద్రాయణగుట్ట, బాబానగర్, మిధాని, ఓవైసీ చౌరస్తాలా మీదుగా కర్మన్‌ఘాట్ వైపు స్తంభించిన ట్రాఫిక్‌లో ప్రయాణించాల్సి ఉండేది.

దశలవారీగా ఆర్సీఐ రహదారి పనులు..

2015–16వ సంవత్సరం నుంచి ఆర్సీఐ రహదారి దశలవారీగా అధునాతనంగా మారుతుండడంతో ఈ రోడ్డును ఆశ్రయించే వాహనదారుల సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. ఆర్‌సీఐ–బాలాపూర్ శివాజీ చౌక్ వరకు పలు దఫాలుగా విస్తీర్ణం దాల్చుకోవడం, శివాజీ చౌక్ నుంచి ఆర్సీఐ వరకు వన్ వే గా ఉన్న ఈ రహదారిని టూవేగా సైతం మార్చారు. దీంతో అప్పటి నుంచి వాహనాల సంఖ్య రెట్టింపయ్యాయి. బాలాపూర్ చౌరస్తా నుంచి ఆర్సీఐ కూడలి వరకు రోడ్డు విశాలంగా ఉండడంతో రాకపోకలు సాఫీగా సాగుతున్నప్పటికీ, ఆర్సీఐ కూడలి నుంచి పహాడీషరీఫ్ ప్రధాన రహదారి వైపు చేపట్టిన విస్తరణ పనులు పూర్తి చేస్తే వాహనదారులకు వెసులుబాటుగా మారనుంది.

వెంటనే ప్రారంభించాలి..

రోజు రోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్సీఐ రహదారి విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలి. రోడ్డు విస్తరిస్తే వాహనదారులకు సమయంతో పాటు ఇందనం కూడా ఆదా అవుతోంది. ఈ రహదారి అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి నగరానికి ఈ దారిలోనే వెళ్తున్నారు. చాంద్రాయణగుట్ట వైపు ఏదైనా రోడ్ల మరమ్మతులు జరిగినప్పుడు ఆర్టీసీ బస్సులు సైతం ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తుంటాయి.

– ఆంజనేయులు, వాహనదారుడు